ఏపీ అటవీ శాఖ అబివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గా మాజీమంత్రి సుజయ్ కృష్ణ రంగారావు నియామకం

సుజయ్ కృష్ణ రంగారావు

తెంటు లక్ష్మం నాయుడు

విశాలాంధ్ర-బొబ్బిలి: రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావుకు ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ కార్పొరేషన్ చైర్మన్‌గా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు అవకాశం కల్పించారు. టిడిపి మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మం నాయుడు కు బొబ్బిలి అర్బన్ అథారిటీ చైర్మెన్‌గా అవకాశం కల్పించారు. దీంతో నియోజకవర్గంలో టీడీపీ నాయకులు అభిమానులు అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

ఉప విద్యాశాఖాధికారి మోహనరావు

విశాలాంధ్ర-బాడంగి: పదో తరగతి చదువు తున్న విద్యార్థులంతా శతశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి మోహన్‌రావు కోరారు. స్థానిక జడ్పీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా శనివారం సందర్శించారు . ఈ సందర్శనలో ఆయన మాట్లాడుతూ విద్యా ర్థులతో కష్టపడి చదివి మంచి మార్కులతో పాస్ అవ్వాలని కోరారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ఏరోజు కారోజు చదివిన వారంతా మంచి మార్కు లు సాధించడం కష్టతరం కాదన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించి రాబోయే పదోతరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాదించాలని అన్నారు. నాణ్యమైన మధ్యాహ్నం భోజనం అందివ్వాలని కోరారు.అపార్ట్ కార్డుల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంఈఓ2 ఎం. రాజేశ్వరి,ఇంచార్జ్ హెచ్.ఎం తెంటు వెంకట లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి

కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

68వ రాష్ట్రస్థాయి అండర్ -14 వాలీబాల్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-భోగాపురం: విద్యార్థులు గొప్ప క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోరారు. క్రీడల్లో రాణించాలంటే శారీరక ఆరోగ్యంతో పాటు, ఎంతో శ్రమ, పట్టుదల, ఓర్పు ఉండాలని ఆయన సూచించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్ -14 బాల బాలికల వాలీబాల్ పోటీలను భోగాపురం జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జిల్లా కలెక్టర్ అంబేద్కర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటువంటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణం అని పేర్కొన్నారు. ఈ పోటీల్లో రాణించి, జాతీయస్థాయి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. తద్వారా తమ జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి గొప్ప పేరు ప్రఖ్యాతులు సముపార్జించాలని కోరారు. రాష్ట్రస్థాయి పోటీలకు మన జిల్లా ఆతిథ్యం ఇవ్వడం ఆనందదాయకంగా ఉందని, ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖను అభినందించారు. పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన బాల బాలికలకు అన్ని వసతులు కల్పించాలని, క్రీడలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు చదువులతోపాటు క్రీడలు కూడా ఒక భాగమని పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వం విద్యా బోధన తో పాటు క్రీడా పోటీల నిర్వహణ కూడా ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఐపిఈ జి.భానుమూర్తి రాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాఠశాల క్రీడా పోటీల నిర్వహణకు ఈ ఏడాది ప్రభుత్వం సుమారు రూ. 7.4 కోట్లను మంజూరు చేయడం విశేషమని పేర్కొన్నారు. క్రీడలకు, క్రీడాకా రులకు గొప్ప భవిష్యత్తు ఉందని, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణంరాజు మాట్లాడుతూ క్రీడా పోటీలు నిర్వహణ గురించి నివేదికను వెల్లడించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన 12 మంది బాలురను, మరో 12 మంది బాలికలను డిసెంబర్లో వారణాసిలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తారని తెలిపారు. ముందుగా కలెక్టర్ అంబేద్కర్ జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఫ్లాగ్ మార్చ్ తిలకించి క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. క్రీడాజ్యోతిని వెలిగించారు. పోటీలకు హాజరైన బాల బాలికల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా బాల బాలికల జట్లు, మూడు రోజులపాటు నిర్వహించే ఈ రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరయ్యాయి. ఈ సందర్భంగా భోగాపురం కేజీబీవీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో కె.వెంకటరమణ, ఎంఈఓ బి చంద్రమౌళి, పాఠశాల హెడ్మాస్టర్ పీఏజిహెచ్ శ్రీనివాసరావు, ఈవోపీఆర్డి గాయత్రి, రాష్ట్ర వాలీబాల్ సంఘ కార్యదర్శి భగవాన్దాస్, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల పరిశీలకులు చంద్ర వర్మ, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కేవీఎవన్ రాజు, దెందేరు పాఠశాల హెచ్ఎం సునీత, కె. సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురుని సన్మానించారు.

ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తా : ఎంపీ కలిశెట్టి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఎల్ఐసి ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమ స్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్తామని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ) విజయనగరం బ్రాంచ్ నాయకులు శనివారం ఎంపీ అప్పల నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీ అప్పలనాయుడు దృష్టికి ఎల్ఐసి ఏజెంట్ యూనియన్ విజయనగరం బ్రాంచ్ అధ్యక్షుడు చిల్లా రామకృష్ణ, కార్యదర్శి ఇల్లాపు కృష్ణ తీసుకువెళ్లారు. తగ్గించిన కమిషన్ ను గతంలో ఇచ్చిన మాదిరిగానే ఇవ్వాలని, క్లా బ్లాక్ విధానాన్ని రద్దు చేయాలని, ఈ విషయాన్ని ఎల్ఐసి యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లాలని వారు కోరారు. ఎల్ఐసి ఏజెంట్లు చెప్పిన సమస్యలను సావధానంగా విన్న అప్పల నాయుడు ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిటీ సభ్యుడు బద్దుకొండ వెంకట రమణ, విజయనగరం బ్రాంచ్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సబ్బవరపు సూరినాయుడు, డివిజన్ ఉపాధ్యక్షుడు జరజాపు వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ పై ప్రపంచ యాత్ర

పర్యావరణ పరిరక్షణకై యువకుడి సాహసం

విశాలాంధ్ర-చీపురుపల్లి: కాలుష్యం లేని ప్రపంచాన్ని సృష్టించాలంటూ..పర్యావరణ పరిరక్షణ కోసం తమిళనాడు నుంచి 2021 వ సంవత్సరంలో ప్రారంభించిన ప్రపంచ సైకిల్ యాత్ర శుక్రవారంనాడు చీపురుపల్లి పట్టణానికి చేరుకుంది. ఈ యాత్ర నిర్వహిస్తున్న తమిళనాడు ప్రాంతానికి చెందిన ముత్తు చిలవన్పర్యటనకు సంబంధించి విలేకరులకు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. 2021 డిసెంబర్ నెలలో తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్ నుండి సాహస యాత్రను ప్రారంభించాడు. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ లేక మృత్యువాత పడ్డ వేలాదిమంది మరణాలు తనను యాత్రకు ప్రయత్నించాయన్నారు. ప్రపంచ యాత్రలో భాగంగా ఇండియా, నేపాల్,బంగ్లాదేశ్, మయన్మార్, తదితర ఏడు దేశాలలో సైకిల్ యాత్ర నిర్వహించనున్నానన్నారు. పర్యావరణ పరిరక్షణ పైన ప్రజల్లో అవగాహన కల్పిస్తూ గంటకి ఐదు కిలోమీటర్లు చెబుతున్న రోజుకి 50 కిలోమీటర్ల దూరం సైకిల్ తొక్కుకుంటూ ప్రయాణం సాగిస్తున్నామన్నారు. సుమారు 122 కిలోల బరువు గల సైకిల్ తొక్కుకుంటూ ప్రయాణం సాగిస్తున్నానన్నారు. మూడు సంవత్సరాలపాటు సాధనన్న ఈ సాహస యాత్రలో 39,300 కిలోమీటర్ల ప్రయాణం సాగిస్తూ ఏడు దేశాలలో పది లక్షల మొక్కలు నాటాలన్న లక్ష్యంగా ఈ సాహస యాత్రను కొనసాగిస్తున్నాను అన్నారు. ఈ సాహస యాత్రలో ప్రజల విరాళాలతో ముందుకు సాగుతున్నానన్నారు. అటవీ శాఖ అధికారుల అనుమతులతో మొక్కలను తీసుకొని ఇప్పటివరకు సాగిన ప్రయాణంలో నాలుగు లక్షల 55000 మొక్కలు నాటించమన్నారు. అడవులు అంతరించిపోవడం వలన, కాలుష్యం పెరిగిపోయి ఆక్సిజన్ కొరత కారణంగానే మరణాలు సంభవించాయని, భవిష్యత్తులో ఇటువంటి మరణాలు సంభవించకూడదన్న లక్ష్యంతోనే ఈ యాత్రను కొనసాగిస్తున్నానని ముత్తు చిల్వాన్ తెలిపారు. ఇంకా ఏడాదిన్నర పాటు తన యాత్ర కొనసాగుతుందని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

నమ్మించి స్నేహితుడే చంపేశాడు

విజినిగిరి హత్యకేసును ఛేదించిన పోలీసులు

నిందితున్ని రిమాండ్‌కు పంపనున్నట్లు సిఐ రవికుమార్ వెల్లడి

విశాలాంధ్ర-జామి: చేసేవి చెడుపనులు.. గ్రామంలో వీరిని అందరూ చీదరించుకుంటారు. కానీ వారిద్దరూ మంచి స్నేహితులుగా వున్నారు. కానీ ఆ చెడు పనులే వారిమధ్య హత్య చేసేంత తీవ్రంగా మారుతాయని ఎవరూ అనుకోలేదు. మండలంలోని విజినిగిరిలో గురువారం రాత్రి జరిగిన గనివాడ అచ్చంనాయుడు హత్య కేసును పోలీసులు ఛేదించారు. హత్యకు పాల్పడిన నిందితుడు వెంపడాపు సూరిబాబును అరెస్టు చేసారు. అందులో భాగంగా శనివారం సిఐ కె. రవికుమార్ జామి పోలీస్‌స్టేషన్‌లో విలేఖరుల సమావేశం నిర్వహించి నిందితుడు వెంపడాపు సూరిబాబును సమావేశంలో చూపించారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ రెండు నెలలక్రితం విజినిగిరి గ్రామంలో ఓఇంట్లో సూరిబాబు దొంగతనం చేసి ఓ సెల్‌ఫోన్, కొంతనగదు చోరీ చేసాడన్నారు. నగదును తీసుకుని, సెల్‌ఫోన్‌ను స్నేహితుడైన గనివాడ అచ్చంనాయుడుకు ఇచ్చి అమ్మమని చెప్పాడు. సెల్‌ఫోన్‌ను జామికి తీసుకువచ్చి అమ్మకం చేస్తుండగా గ్రామస్థులకు అచ్చంనాయుడు పట్టుబడ్డాడు. ఈసమయంలో పోలీసులకు ఫిర్యాదు సైతం ఇవ్వడం జరిగింది. కానీ గ్రామ పంచాయతీ పెద్దలు పంచాయతీ నిర్వహించి సెల్‌ఫోన్‌ను బాధితునికి ఇవ్వడంతోపాటు దొంగతనం చేసిన సూరిబాబుకు, అచ్చంనాయుడులకు చెరో రూ.3వేలు జరిమానా విధించారు. అయితే తాను దొరికిపోవడానికి అచ్చంనాయుడే కారణమని అతనిపై సూరిబాబు కక్ష్య పెంచుకున్నాడు. అదేరోజున నిన్ను చంపేస్తానని హెచ్చరించాడు. అతని మాటలకు భయపడిన అచ్చంనాయుడు రెండు నెలలుగా వేర్వేరు ప్రాంతాలలో కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగించాడు. గురువారం తన అమ్మను చూసేందుకు అచ్చంనాయుడు తిరిగి విజినిగిరి గ్రామానికి వచ్చాడు. అలాగే జామిలో ఉన్న తన అక్క శిరిపురపు కొండమ్మ వద్దకు వెళ్ళి తాను హైదరాబాద్ వెళ్ళిపోతానని చెప్పి వంద రూపాయలను అడిగి తీసుకున్నాడు. కానీ సాయంత్రం అచ్చంనాయుడును గ్రామంలో సూరిబాబు చూసాడు. నీపై కోపం లేదని చెప్పి మద్యం తాగుదామని నమ్మించి బెల్టు దుఖాణానికి తీసుకువెళ్ళి ఫూటుగా ఇద్దరూ తాగారు. అనంతరం ఇద్దరు గొడవ పడి కొట్లాటకు దిగారు. ఈసమయంలో సూరిబాబు అచ్చంనాయుడును శరీరావయవాలపై తీవ్రంగా కొట్టడంతో అచ్చంనాయుడు మరణించాడు. మృతి చెందిన అచ్చంనాయుడు మృతదేహాన్ని గ్రామ శివారున ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌వద్ద పడేసి విద్యుత్ షాక్‌తో మరణించాడని అందరూ భావించే పథకం రచించాడు. గ్రామస్థులుకు ఈవిషయాలన్నీ తెలిసి పోలీసులకు సహకరించక పోయినా అత్యంత చాకచక్యంగా సిఐ రవికుమార్, ఎస్ఐ వీరజనార్ధన్‌లు కేసును దర్యాప్తు చేసి వాస్తవాలను బైటకి తీసారు. నిందుతుడు వెంపడాపు సూరిబాబు తానే హత్య చేసానని అంగీకరించాడు. నిందితున్ని రిమాండ్‌కు తరలిస్తామని సిఐ తెలిపారు.

తారాపురంలో ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

విశాలాంధ్ర -రామభద్రపురం: మండలంలోని తారాపురం గ్రామంలో మరడాం రవి గురుస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పడిపూజ ఘనంగా జరిగింది. ఈ పడిపూజ గ్రామానికి చెందిన వెక్కుదు ఆనంద్ స్వామి పెట్టారు. పడిపూజకు మిర్తి వలస, జన్ని వలస, కొట్టక్కి, తారాపురం గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి భజనలతో పూజను రవి గురుస్వామి ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వాములందరికీ అల్పాహారము ఏర్పాటు చేశారు. అలాగే అయ్యప్ప మాలాధారణ చాలా కఠినతరమైనదని, స్వాములందరూ నిష్టగా ఉండాలని అన్నారు. ఈ అయ్యప్ప మాల వేసుకునే వారు చాలా పుణ్యాత్ములని కొనియాడారు. మానవ జీవితంలో ఒక్కసారైనా ప్రతి ఒక్కరూ అయ్యప్ప మాల ధరించి కేరళలో ఉన్న అయ్యప్ప స్వామిని దర్శించుకునే భాగ్యం పొందాలనిఅన్నారు.

కొత్త ఓటరు నమోదుపై పర్యవేక్షణ

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలంలో ఉన్న ప్రతి ఒక్క పోలింగ్ స్టేషన్ దగ్గర స్పెషల్ క్యాంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా బిఎల్ఓ ఆధ్వర్యంలో వాటర్ నమోదు చేస్తున్నారు. శనివారం మండలంలో బాదాం కొత్త కర్ర, పోలింగ్‌స్టేషన్ ని సర్వేయర్ బి.శంకర్రావు వీఆర్వో తిరుపతి రావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ సర్వేయర్ తెలుపుతూ శని ఆదివారాలు సెలవులు అయినప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ క్యాంపెయిన్ ప్రోగ్రాం లో భాగంగా ఈ ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కొత్తగా ఓటర్లు నమోదు చేసుకునేందుకు ఇదొక సదవకాశమని, ఉదయం10 గంటల నుండి సాయంత్రం 5 వరకు ఓట్లు చేర్పు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేర్ శంకర్రావు, వీఆర్వో తిరుపతిరావు తో పాటు బిఎల్ఓ బి లక్ష్మణరావు పాల్గొన్నారు.

విజయరాంపురం స్కూలుకు ఎస్‌జిటి ని నియమించాలి



విశాలాంధ్ర-తెర్లాం: ఇటీవల విజయ రాంపురం(బూరుపేట) ఎంపీయుపి స్కూల్లో పనిచేసిన ఎంటిఎస్ ఉపాధ్యాయులు పదవి విరమణ చేస్తున్నం దున ఆయన స్థానంలో ఎస్ జి టి ఉపాధ్యాయుడ్ని నియమించాలని శనివారం మండల రిసోర్స్ కార్యాలయంలో ఎంఈఓ-2 ఆర్ పాపారావుకు విజయరాంపురం సర్పంచ్.బూరిమధుసూధనరావు కు వినతిపత్రం అందజేశారు.

ఉచిత న్యాయ సేవలను అందించడమే న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణ చక్రవర్తి

విశాలాంధ్ర-విజయనగరం: పేద ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు న్యాయ సేవాధికార సంస్థ తోడ్పడుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. అట్టడుగు వర్గాల ప్రజలకు ఉచితంగా న్యాయ సేవలను అందించడమే ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. జిల్లా పాత కోర్టు భవన సముదాయంలో, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా న్యాయమూర్తి ముఖ్యఅతిథి హాజరై ప్రసంగించారు. ఆర్థికంగా వెనుకబడినవారికి న్యాయసేవలను అందించే ఉద్దేశ్యంతో న్యాయ సేవాధికార సంస్థ వ్యవస్థను 1995 నవంబర్ 9 న సుప్రీం కోర్టు ప్రవేశ పెట్టిందని తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా జిల్లా స్థాయి, మండల స్థాయి లో సమావేశాలు నిర్వహించి ప్రజలకు, విద్యా ర్థులకు చట్టాలపై అవగాహన కల్పించామని తెలిపారు. రెవిన్యూ శాఖ, పోలీస్ శాఖల సహకారంతో విస్తృతంగా న్యాయ అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని అన్ని వర్గాల వారు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయమూర్తి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఎస్సీ,ఎస్టీ కోర్ట్ జడ్జి బి.అప్పల స్వామి, స్పెషల్ మొబైల్ కోర్ట్ జడ్జి పి.బుజ్జి, జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్పి ఎం.వీరకుమార్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాల్ లో ఆపరేషన్. చికిత్స వికటించి శిశువు మృతి...

విశాలాంధ్ర-చీపురుపల్లి: వీడియో కాల్ లో డాక్టర్ సలహాలు తీసుకుంటూ కనీస అర్హతలు లేని నర్సులు సస్త్ర చికిత్సలు నిర్వహించడంతో చికిత్స వికటించి శిశువు మృతిచెందిన సంఘటన విజయనగరం జిల్లా చీపురుపల్లి పట్టణంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి భిన్న కథనాలు వినిపిస్తున్నప్పటికీ ఆసుపత్రి యాజమాన్యంనకు, మృతి చెందిన శిశువు కుటుంబానికి మధ్య ఒప్పందం కుదిరిన సంఘటన స్థానికంగా హల్చల్ చేస్తుంది. గరివిడి మండలం కాపు సంఘం గ్రామానికి చెందిన ఏ నూతల గౌరనాయుడు నెలలు నిండిన తన భార్య మౌనికను చీపురుపల్లి స్టేట్‌బ్యాంక్ వెనుక గల ఓ ప్రైవేటు ఆసుపత్రికి ప్రసవం కోసం చేర్పించారు. సాధారణంగా నొప్పులు రాకపోవడంతో సాయంత్రం శస్త్ర చికిత్సలు నిర్వహించాలంటూ బాధితులకు ఆసుపత్రి సిబ్బంది తెలపడంతో వారు అంగీకరించారు. ఆ సమయంలో అర్హతలు గల డాక్టర్ లేకపోయినప్పటికీ వీడియోకాల్ ద్వారా డాక్టర్ సంప్రదించి కనీస అర్హతలు లేని కొంతమంది నర్సులు చికిత్స చేశారని, అందుకే శిశువు మృతిచెందినట్లు ఆరోపిస్తున్నారు, ఇదిలా ఉండగా, చికిత్స సమయంలోనే శిశువు మృతి చెందినప్పటికీ హాస్పిటల్ వర్గాలు బంధువులకు తెలియజేయకుండా ఠాగూర్ సినిమా మాదిరిగా సాయంత్రం వరకు సినీఫక్కీలో డ్రామాలు ఆడారంటూ బంధువర్గాలు ఆందోళనకు దిగారు. సాయంత్రం సమయానికి శిశు ఆరోగ్యం బాగోలేదు విజయనగరం తరలించాలంటూ ఆసుపత్రి వర్గాలు తెలియజేయడంతో బాధితులు అనుమానంతో శిశువుని పరిశీలించగా అప్పటికే శిశువు మృతిచెందినట్లు తెలియడంతో వారు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. అయితే ఆసుపత్రి యాజమాన్యం బాధితులు మధ్య ఒప్పందం కుదిరినట్లు స్థానికంగా ప్రచారం కొనసాగుతుంది. ఈ నేపథ్యంలోనే సమాచారాన్ని బయటకు పొక్కనీయకుండా ఆసుపత్రి యాజమాన్యం కొంతమంది సమాచారం ప్రతినిధులతో కూడా మిలాకాత్ అయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలకు ప్రాణం పోయాల్సిన వైద్యులే వైద్యాన్ని వ్యాపారంగా మార్చి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : కేసలి

వైద్యసేవలతోపాటు పసికందులకు ప్రాణం పోయవలసిన వైద్య సిబ్బంది విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని బాల బాలికల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు హెచ్చరించారు. శనివారం చీపురుపల్లిలోని బాపూజీ హాస్పిటల్ ను ఆయన సందర్శించారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ బాలింత పురిటిలోనే బిడ్డను కోల్పో యిన సంఘటన జిల్లా వ్యాప్తంగా సంచలన రేపింది.ఈ సంఘటనపై ఆసుపత్రిని సందర్శించి వైద్యుల పనితీరుపై ఆరా తీశారు. చికిత్స జరిపే సమ యంలో సీసీ కెమెరాలు ద్వారా పొందు పరిచిన వీడియో క్లిప్పింగులను సమర్పించాలంటూ ఆసుపత్రి యాజ మాన్యానికి సూచించారు. కార్యక్రమంలో గరివిడి ఐసిడిఎస్ పిఓ ఆరుద్ర పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ

విశాలాంధ్ర-వేపాడ: ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పులపై బూత్ లెవెల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని శృంగవరపుకోట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ సూచించారు. మండలంలోని బొద్దాం, పోలింగ్ కేంద్రాలు నెంబర్లు 72,73,74, అలాగే సోంపురం పోలింగ్ కేంద్రాలు79,80 లలో గల పోలింగ్ బూతులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా నమోదు నిరంత ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాలలో గల 18 పైబడిన వారిని నూతన ఓటర్లగా నమోదు చేయించాలన్నారు. అలాగే ఓటర్లలో చనిపోయిన వారి పేర్లను తొలగించాలని, పేర్లు తప్పులను, సవరించే విధంగా ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దారుసౌమ్య,మండల తహసిల్దార్ జె. రాములమ్మ, వీఆర్ఓ అప్పల రామ్,సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తూర్పు కాపు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా యశస్వి

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: తూర్పు కాపు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, విజయనగరం జనసేన సీనియర్ నాయకురాలు పాలవలస యశస్వి ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టులో అడ్వకేట్ గా ఉన్న యశస్వి 2019 ఎన్నికల్లో విజయనగరం శాసనసభ నియోజకవర్గ తరఫునుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ వస్తున్నారు. 2019 నుండి 2024 ఎన్నికల వరకు జనసేన పార్టీని విజయనగరం జిల్లాలో క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈమె ఎంతగానో శ్రమ పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలో కష్టపడిన వారికి కచ్చితంగా పదవులు ఇస్తామని పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీ మేరకు పాలవలస యశస్వికి తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవిని కేటాయించారు. ఈమెకు పదవి లభించడంపై విజయనగరం జిల్లా జనసేన కార్యకర్తలు, సంతోషాన్ని వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

పోలీసు దౌర్జన్యాలపై వైయస్ఆర్‌సీపీ న్యాయపోరాటం

ఉమ్మడి విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పోలీసు యంత్రాంగం చంద్రబాబు, లోకేష్ గుప్పిట్లోకి వెళ్లి మానవహక్కులను హరిస్తోందని, పోలీసు దౌర్జన్యాలపై వైయస్ఆర్‌సీపీ న్యాయపోరాటం చేస్తుందని ఉమ్మడి విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అన్నారు. శనివారం జిల్లా పరిధిలో పార్టీ నేతలలు, సోషల్ మీడియా కార్యకర్తలుతో కలిసి స్థానిక డి.ఎస్.పి కార్యాలయంలో విజయనగరం టౌన్ డిఎస్పి ఎం.శ్రీనివాసరావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలోని టీడీపీ కూటమి అసమర్థ పాలనను సోషల్ మీడియా ద్వారా ప్రశ్నిస్తే వేధిస్తున్నారని మండిపడ్డారు. సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టారని పలుచోట్ల కేసులు పెట్టారన్నారు. సోషల్ మీడియా కార్యకర్తలను ఉగ్రవాదులును హింసించినట్టు హింసించారని ఒక మహిళను ఐదురోజులు చిత్రహింసలు పెట్టడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల ఎస్పీతో పాటు డీజీపీకి ఫిర్యాదు చేస్తున్నామన్నారు. పోలీస్ అధికారులు చట్టబద్ధంగా వ్యవ హరించాలని పోలీసు యంత్రాంగం మానవ హక్కులను హరిస్తున్నారన్నారు. పోలీసు దౌర్జన్యాలపై వైయస్ఆర్‌సీపీ న్యాయపోరాటం చేస్తుందని అన్నారు.

నేడు గర్భాంలో స్వామిల అంబలం పూజ

విశాలాంధ్ర-మెరకముడిదాం: మెరకముడిదాం మండలం గర్భా గ్రామంలో ఆదివారం నాడు మండల స్థాయి స్వామిలుకు అంబలం పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల టిడిపి యువ నాయకులు తాడ్డి చంద్రశేఖర్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పూజా కార్యక్రమం విశాఖపట్నం జిల్లా కశింకోట వాస్తవ్యులు, సహస్రాదిక దేవాలయ ప్రతిస్థాపకులు శ్రీమాన్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో జరగనున్నట్లు స్వామి తెలిపారు. అంబలం పూజా కార్యక్రమం ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు నిర్వహించనున్నట్లు ఆయన అన్నారు. అందువలన మండలంలో వున్న 29 పంచాయతీల్లో వున్న పీఠాలు స్వామిలు తప్పనిసరిగా అంబలం పూజా కార్యక్రమంనకు హాజరు కావాలని ఆయన కోరారు. అలాగే పూజా కార్యక్రమంను చీపురుపల్లి శాసన సభ్యులు కిమిడి కళావెంకట రావు ముఖ్య అతిధిగా హాజరు అవుతారని చంద్రశేఖర్ స్వామి తెలిపారు.

జిల్లాను వరించిన నామినేటెడ్ పదవులు

సుజయ్, తెంటు, యశస్వినికి ప్రకటించిన ప్రభుత్వం

విశాలాంధ్ర-విజయనగరం: ప్రభుత్వం నామినేటెడ్ పదవుల రెండవ విడత పందేరంలో విజయనగరం జిల్లాకు ప్రాదాన్యత కల్పించింది. శనివారం వెలువడిన నామినేటెడ్ పోస్టుల జాబితాలో ముగ్గురు కూటమి నేతలకు పదవులను ప్రకటించారు. వారిలో తెలుగుదేశంపార్టీకి చెందిన ఇద్దరికి, జనసేన నేతకు ఒకరికి పోస్టులను కేటాయించారు. తెలుగుదేశం పార్టీకి చెందిన బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే సుజయ్‌కృష్ణరంగారావుకు ఎపి ఫారెస్టు డవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్‌గా నియమించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడుకు బొబ్బిలి అర్బన్ డవలప్‌మెంట్ అదారిటీ చైర్మన్‌గా నియమించారు. ఇక జనసేన రాష్ట్ర నేత పాలవలస యశస్వినికి ఎపి తూర్పుకాపు వెల్ఫేర్ అండ్ డవలప్‌మెంట్ చైర్మన్ పదవిని ప్రకటించారు.

బొబ్బిలికి ప్రాదాన్యత ఇచ్చిన అధిష్టానం

జిల్లాలోని బొబ్బిలి డివిజన్‌కు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ప్రాదాన్యత ఇచ్చింది. రెండు కీలక పదవులను బొబ్బిలి మాజీ ఎమ్మెల్యేలకు ఇచ్చిన తగిన విదంగా గౌరవించింది. యఅఇతే విజయనగరం డివిజన్‌కు, చీపురుపల్లి డివిజన్‌కు చెందిన పలువురు ఆశావహులకు తీవ్ర విషాదం మిగిలింది. మొదటి జాబితాలో తమ పేరు రాకపోవడంతో రెండవ జాబితాలో తప్పనిసరిగా ఉంటుందని తమ అనుచరుల వద్ద పలువురు నేతలు నచ్చజెబుతూ వచ్చారు. కానీ రెండువ జాబితాలో సైతం తమకు చోటు లేకపోవడంతో అయోమయంలో పడ్డారు. ఆయా నేతల అనుచరులు ప్రస్తుతం ఆవేతనలో మునిగిపోయారు.

సుజయ్‌కృష్ణరంగారావు

తెంటు లక్ష్మంనాయుడు

పాలవలస యశస్విని

నామినేటెడ్ పదవుల్లో గొంపకు దక్కని చోటు

గొంప కృష్ణ

విశాలాంధ్ర-జామి: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెండవవిడత నామినేటెడ్ పదవుల జాబితాలో శృంగవరపుకోట నియోజకవర్గ యువనేత, ఎన్ఆర్ఐ గొంపకృష్ణకు చోటు దక్కకపోవడంతో నియోజకవర్గంలో చర్చానీయంశంగా మారింది. తెలుగుదేశం పార్టీలో ఎస్‌కోట టిక్కెట్ దాదాపు ఖరారు దశలో అధిష్టానం ఆదేశాలమేరకు ఆయన పోటీనుంచి తప్పుకున్నారు. తగినరీతిలో గౌరవిస్తామని అధిష్టానం హామీ సైతం ఇచ్చింది. దీంతో అనుచరులు సైతం నామినేటెడ్‌పోస్టుతో న్యాయం చేస్తారని భావించారు. మొదటి విడతలో చోటు దక్కకపోయినా రెండవవిడతపై ఆశలు పెట్టుకున్నారు. ఇప్పుడు జాబితా చూసి అవాక్కయ్యారు. నామినేటెడ్ పదవుల జాబితా అనంతరం గొంప వర్గీయులు చర్చలు జరుపుకుంటున్నారని సమాచారం. ప్రస్తుతం గొంపకృష్ణ టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. ఈవిషయంలో అధిష్టానంతో చర్చించే అవకాశాలు ఉన్నాయి

విశాలాంధ్ర
పేజి : 2
విజయనగరం
ఆదివారం 10, నవంబర్ 2024

నేడు విజయనగరం రానున్న హీరో వరుణ్ తేజ్

ఆదిత్య థియేటర్లో 'మట్కా' న్యూ పోస్టర్ రిలీజ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : వరుణ్ తేజ్ 'మట్కా' న్యూ పోస్టర్ రిలీజ్ కార్యక్రమం ఆదివారం విజయనగరం ఆదిత్య థియేటర్లో జరుగుతుందని మెగా అభిమాన నాయకులు తెలియజేశారు. శనివారం హోటల్ జీఎస్ఆర్ లో జరిగిన సమావేశంలో అభిమాన సంఘం నాయకులు గురాన అయ్యలు,త్యాడ రామకృష్ణ,రాంకీ, కె. కృష్ణారావు,ఎంటి రాజేష్,పిడుగు సతీష్,కె.లక్ష్మణ్, వై.చక్రవర్తి, ఎమ్ . శ్రీనివాస్,కుమార్, ఎల్లారావు తదితరులు మాట్లాడుతూ మట్కా' న్యూ పోస్టర్ రిలీజ్ .. మెగాహీరో వరుణ్ తేజ్ చేతులు మీదుగా జరుగుతుందని తెలియజేశారు...ఆదివారం ఉదయం 10:30 గంటలకు ఆదిత్య థియేటర్లో పోస్టర్ రిలీజ్ జరుగుతుందన్నారు.మెగా అభిమానులందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అన్ని దానాలలో అన్నదానం మిన్న...

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: వందలాదిమందికి అన్న ప్రసాదం అందించడం చాలా గొప్ప విషయమని, 'అన్ని దానాలలో అన్నదానం మిన్న' అని రాష్ట్ర చిన్న,సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద అయ్యప్ప మాలాదారుల కోసం నిర్వహించబడుతున్న అన్న ప్రసాద క్రతువుకు హాజరయ్యారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు వేదమంత్రాల నడుమ పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. మంత్రి కొండపల్లి శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని, అనంతరం అయ్యప్పస్వామి పూజలో పాల్గొని, మాలాదారులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీ పంచముఖ ఆంజనేయ నిత్య అన్నప్రసాద వితరణ ట్రస్ట్ చేస్తున్న సేవలు, కార్యక్రమాలు విన్నానని, నేడు స్వయంగా చూస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కంది మురళి నాయుడు, పెంటపాటి కామరాజు, ప్రముఖ వ్యాపారులు శివ్వా నాని, పెంటపాటి ముత్యాలు, నారాయణం లక్ష్మణరావు, కలగర్ల నారాయణరావు,సునీల్ జైన్,సునిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

రెవిన్యూ డివిజనల్ అధికారి వివిఎస్ఎస్ రామ్మోహన్ రావు

విశాలాంధ్ర-బొబ్బిలి: ఎన్నికల బూత్ లెవెల్ అధికారులు సిబ్బంది 18 సంవత్సరాల వయస్సు పైబడిన యువతీ యువకులు ఓటు హక్కు వినియోగించుకోవాలని అందుకు ఎన్నికల బూత్ లెవెల్ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలని నిర్లక్ష్యం వహించిన సిబ్బంది పైన చర్యలు తప్పవని రెవిన్యూ డివిజనల్ అధికారి వి ఎస్ ఎస్ రామ్మోహన్ రావు అన్నారు. శనివారం పట్టణం సిపిఎం స్కూల్ లో రెవెన్యూ డివిజనల్ అధికారి వి ఎస్ ఎస్ రామ్మోహన్ రావు, తహశీల్దార్ ఎం శ్రీను ఎన్నికల విధులను పరిశీలన చేశారు. కొత్తగా ఓటర్లుగా నమోదు, వలస వెళ్లిపోయిన ఓటరు ను తొలిగింపు, మృతిచెందిన వ్యక్తుల ఓటు హక్కు ను తొలిగించాలని సిబ్బంది ఆదేశించారు. అనంతరం ఐటిఐ కాలనీ, మండలంలో మెట్టవలస, పారాది గ్రామాల్లో పోలింగ్ బూత్ లను రవీందర్ డివిజనల్ అధికారి సందర్శించారు. ఈ పరిశీలనలో ఎన్నికల ఉప తహశీల్దార్ బలివాడ గౌరీ శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా స్టాప్ డయేరియా ఫీవర్ సర్వే

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: నగరంలో స్టాప్ డయేరియా ఫీవర్ సర్వే ముమ్మరంగా సాగు తోంది. ప్రాణాంతక మరియు అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ప్రతి సచివాలయ పరిధిలో స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపడుతున్నారు. డయేరియా ప్రజలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం సచివాలయ సిబ్బంది,ఏఎన్ఎంలు సంయుక్తంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందిస్తూ అంటువ్యాధులు గూర్చి చైతన్యం తీసుకొస్తున్నారు. అలాగే ఫీవర్ సర్వే కూడా చేపడుతున్నామన్నారు.

10లో శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

మండల విద్యాశాఖ అధికారి బాల భాస్కరరావు.

విశాలాంధ్ర-వేపాడ: 2024-25 విద్యా సంవత్సరంనకు గాను 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత అయ్యేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి-2 పి.బాల భాస్కరరావు అన్నారు. మండల కేంద్రమైన వేపాడ శివారు బక్కనాడు పేటలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల ఆశ్రమ బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ10వ తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి తగిన సూచనలు అందించారు.అలాగే పాఠ్యాంశాలు పూర్తి చెయ్యాలని, ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షలపై మార్కులు శాతం ఏ విధంగా వచ్చిందో అడిగి తెలుసుకున్నారు.అలాగే విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల విధులకు హాజరు ప్రతిరోజు సమయానికే విధులకు హాజరవ్వాలని అలాగే విద్యార్థులతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది సకాలంలో హాజరయ్యే విధంగా చూడాలన్నారు.పాఠశాల రికార్డులు ప్రధానమంత్రి పోషణను పరిశీలించారు.

ప్రజా సమస్యలపై పోరు యాత్ర

విశాలంధ్ర -అచ్యుతాపురం: ప్రజా సమస్యలపై పోరు యాత్ర సిపిఎం ఆధ్వర్యంలో మండలంలో బుధవారం హరిపాలెంలో మహాసభ జరిగింది. ముఖ్య అతిథి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి .కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడడానికి పెట్టుబడిదారులు ప్రజలపై భారాల మోపుతున్నారని నేడు దేశంలో విపరీతంగా నిత్యవసర వస్తువులు ధరలు పెరిగాయని, సంపన్నుల మీద పన్నులు వేసి సామాన్యులకు రాయితీలు కల్పించాల్సిందే పోయి, పెట్టుబడిదారులకు రాయితీలు ఇస్తున్నారని , సామాన్యులపై భారాలు మోపుతున్నారని ఆరోపించారు . పరిశ్రమలు వస్తే ఉపాధి కలుగుతుందని భవిష్యత్తు బాగుంటుందని భూములను ఇస్తే , పరిశ్రమలు ప్రజలకు ఉపాధి కల్పించకపోగా వ్యాపారాలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై సిపిఎం ప్రజా పోరు యాత్రని చేపట్టిందని సిపిఎం భవిష్యత్తు పోరాటాలకు ఈ మహాసభ వేదికగా కావాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్ రాము , కె సోమునాయుడు , ఎం.అప్పలరాజు, కర్రి అప్పారావు , రాంప్రసాద్, , తాతీయులు , బుద్ధ రంగారావు, అర్.లక్ష్మి, కన్నంనాయుడు , సదాశివరావు తదితరుల పాల్గొన్నారు

పొగిరి గ్రామంలో అవగాహనా సదస్సు

మద్యం గొలుసు దుకాణాల నియంత్రనే లక్ష్యం

విశాలాంధ్ర-రాజాం: ఈరోజు రాజాం మండలం పొగిరి గ్రామంలో రాజాం, ప్రొహిబిషన్ & ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఆర్. జైభీమ్ అక్రమంగా మద్యం అమ్మకాలను నిరోదించే ఉద్దేశ్యం తో పొగిరి గ్రామం లోని ప్రజలకు చైతన్య పరిచే విధంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో బెల్ట్ షాప్ల వలన గ్రామానికి జరుగు అనర్ధాల గురించి వివరించడం జరిగింది. బెల్ట్ షాప్ నిర్వహిస్తూ పట్టుబడిన వారికి చట్ట ప్రకారం ఉన్న శిక్షలు గురించి వాటి తీవ్రత వివరించడం జరిగింది. గ్రామంలో ఎవరైనా అక్రమంగా బెల్ట్ షాప్ లు నిర్వహిస్తున్నట్లయితే ఎక్సైజ్ డిపార్ట్మెంట్ కి సమాచారం ఇవ్వవలసిందిగా కోరడమైనది. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని సీఐ ఆర్.జై భీమ్ తెలిపారు.

కేజీహెచ్ లో రోగ నిర్ధారణ పరీక్షలకు ఆధునిక యంత్రాలు కల్పించాలి

ఉత్తరాంధ్ర సాధన సమితి అధ్యక్షుడు వేమిరెడ్డి

విశాలాంధ్ర-బొబ్బిలి : కేంద్ర గిరిజన శాఖ విశాఖపట్నంలో కేజీహెచ్ లో సికిల్ ఎనీమియా వ్యాధితో పాటు తల సేమియా తో బాధపడుతున్న రోగులకు రోగులకు ఆరు కోట్ల రూపాయలతో ఆధునిక రోగ నిర్ధారణ పరీక్షలతో పాటు మరో 50 లక్షలు రూపాయలు పరీక్షలు నిర్వహించుకోవడానికి అవసరమైన పరీక్షకిట్లు కొనుగోలుకు ఆమోదం తెలిపిందని రాష్ట్రంలో ఏకైక సెంటర్ కేజీ హెచ్ ఎంపిక చేయడం చాలా సంతోషం అని ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో కాకుండా మంగళగిరి ఎయిమ్స్ తరలించాలని నిర్ణయం తీసుకుంటున్నారని ఈ నిర్ణయం వలన ఉత్తరాంధ్రకు తీరని అన్యాయము చేసిన వారు అవుతారని తక్షణమే ప్రభుత్వం నిర్ణయం విరమించుకోవాలని విశాఖ కేజిహెచ్ కు ఆధునిక రోగ నిర్ధారణ పరీక్షలు చేయడానికి యంత్రాలకు అవకాశం కల్పించాలని ఉత్తరాంధ్ర సాధన సమితి అధ్యక్షుడు సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మినాయుడు డిమాండ్ చేశారు. అత్యంత పాలకులు కేవలం సవతి తల్లి ప్రేమ వలకపోస్తుంది తప్ప ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేద్దామని ఇసుమంత దృష్టి పెట్టలేదని ఈ ఉత్తరాంధ్ర ప్రాంతంలో గిరిజనులు అధికముగా ఉన్నారని ఈ ప్రాంతంలోనే ఎక్కువమంది రోగులు ఉన్నట్లు గిరిజన శాఖ వారు గుర్తించారని అన్నారు. చిన్నారులు మహిళలకు ఈ ప్రాంతంలో సి ఓ సి సెంటర్ ఏర్పాటు చేస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం భావించినది అలా కాకుండా ఈ రాష్ట్ర ప్రభుత్వం మంగళగిరి ఎయిమ్స్ తరలించడానికి చూస్తున్నది ఇటువంటి నిర్ణయం సరికాదని ఇటువంటి ప్రతిపాదనలు తక్షణం నిర్మించుకోవాలని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమి రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేయుచున్నారు నోట్ ఇప్పటికే రాజధాని ప్రాంతంలో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడానికి పూనుకున్నారు అది చాలదా...? మిగతా ప్రాంతాలు అభివృద్ధి చెంద వద్దా కాబట్టి ఈ ప్రాంతంలో సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు.

అర్హులంతా ఓటు హక్కు పొందాలి

కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-దెంకాడ/విజయనగరం: అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. ఇందుకోసం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ-2025 కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 9,10 తేదీల్లో అలాగే 23,24 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ శిబిరాల్లో ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసేందుకు దరఖాస్తులను, అలాగే జాబితాలో చేర్పులు మార్పులను చేసేందుకు కూడా దరఖాస్తులను ఇక్కడ స్వీకరిస్తారని తెలిపారు. ఈ ప్రత్యేక తేదీల్లో బిఎల్ఓ లంతా ఇక్కడ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. దెంకాడ మండలం మోదవలస సమీపంలోని గొండయ్య పాలెం ప్రాథమిక పాఠశాలలో బూత్ నెంబర్ 17ను జిల్లా కలెక్టర్ అంబేద్కర్ శనివారం పరిశీలించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను తనిఖీ చేశారు. బూత్ పరిధిలో ఓటర్ల సంఖ్య, కొత్తగా వచ్చిన దరఖాస్తులు తదితర అంశాలపై బిఎల్ఓ ను ఆరా తీశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, ముఖ్యంగా యువ ఓటర్లకు అవగాహన కల్పించి, వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకునేలా చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

పాఠశాల సందర్శన

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంబేద్కర్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్నం భోజన పథకం నిర్వహణపై ఆరా తీశారు. ఆర్వో వాటర్ ప్లాంట్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నూకరాజు, తాసిల్దార్ పద్మావతి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లాలో మైనరు డ్రైవింగు, ట్రిపుల్ డ్రైవింగు, సౌండు పొల్యూషను, డేంజరస్ డ్రైవింగు, డిఫెక్టివ్ నంబరు ప్లేట్లుపై ప్రత్యేక డ్రైవ్ ను నవంబరు 9, 10 తేదీల్లో చేపట్టాలని, ఎం.వి.నిబంధనలను అతిక్రమించి పట్టుబడిన వాహనాలను సీజ్ చేయాలని, మైనర్లును, వారి తల్లిదండ్రులను పోలీసు స్టేషనుకు పిలిపించి, కౌన్సిలింగు నిర్వహించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు తమ పోలీసు స్టేషను పరిధిలోని ముఖ్య కూడళ్ళలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. వాహన తనిఖీల్లో వాహనాలకు సంబంధించి అన్ని రకాలైన అనుమతి పత్రాలను పరిశీలించి, ఎం.వి.నిబంధనలు అతిక్రమించిన వాహనదారుల వాహనాలను సీజ్ చేసారు. అంతేకాకుండా, మైనరు డ్రైవింగు చేస్తూ పట్టుబడిన వాహనాలను, వాహన రికార్డులు సక్రమంగా లేని వాహనాలను సీజ్‌చేసి, పోలీసు స్టేషనుకు తరలించారు. వాహనదారులు తమ వాహనాలను అనుమతి ఉన్నట్లే తమ భద్రతకు, ఇతర వాహనదారులు, పాదచారుల భద్రతకు కొన్ని బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అంతేకాకుండా, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు,ఎం.వి. నిబంధనలు, రహదారి భద్రత ప్రమాణాలను పాటించడంతోపాటు, హెల్మెట్ ధరించడం, ద్విచక్ర వాహనంపై ఇద్దరు మాత్రమే ప్రయాణించడం, నిర్దిష్ట వేగం తోనే వాహనాలను నడవడం, నిబంధనలకు అనుగుణంగా నంబరు ప్లేట్స్ కలిగి ఉండడం, వాహనాల నిర్మాణాన్ని మారుస్తూ శబ్ద కాలుష్యానికి పాల్పడడం చట్టరీత్యా నేరమని వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. స్పెషల్ డ్రైవ్లో భాగంగా మొదటి రోజున జిల్లా వ్యాప్తంగా ఎం.వి. నిబంధనలను అతిక్రమించిన వాహనదారులకు ఈ- చలానాలు విధించగా, మైనరు డ్రైవింగు, ట్రిపుల్ రైడింగ్, ఇరెగ్యులర్ నంబరు ప్లేట్స్, సౌండు పొల్యూషను, సెల్ ఫోను డ్రైవింగు, డ్రైవింగు లైసెన్సు లేని వాహనదారుల వాహనాలను, రికార్డులు సక్రమంగా లేని 531 వాహనాలను సీజ్ చేసి, ఆయా పోలీసు స్టేషన్లుకు తరలించామన్నారు. వాహనాల రికార్డులను పరిశీలించి,కౌన్సిలింగు నిర్వహించి, ఆయా వాహనాదారులపై చర్యలు చేపడుతున్నట్లుగా తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ ను విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డిఎస్పీ పి. శ్రీనివాసరావు, చీపురుపల్లిడిఎస్పీ ఎస్.రాఘవులు, ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు పర్యవేక్షించారు.

సీతంలో ప్లాన్ ఫర్ ది పిన్నాకిల్" సెమినార్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ సీతంలో ప్లాన్ ఫర్ ది పిన్నాకిల్ అనే సెమినార్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమం విద్యార్థులకు, అధ్యాపకులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ వన్) మరియు ఆ ఆధునిక సాంకేతికత, సమాజం యొక్క ప్రభావం గురించి అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. సెమినార్‌కు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో ఐటీ అనలిస్టుగా ఉన్న భాను పవన్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. ఆయన(ఏ వన్) వివిధ పరిశ్రమల్లో, రోజువారీ జీవితంలో చూపుతున్న ప్రభావంపై వివరాలు అందించారు. అలాగే, డేటా ప్రాసెసింగ్, ప్రిడిక్టివ్ అనలిటిక్స్, ఆటోమేషన్ వంటి క్షేత్రాల్లో (ఏ వన్) యొక్క సత్తాను వివరించారు.

సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. శశిభూషణ్ రావు సెమినార్ ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు ప్రేరణాత్మకంగా మాట్లాడారు. విద్యార్థులు సాంకేతిక రంగంలో ఉన్న ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడం కోసం ఏ వన్ వంటి ఆధునిక సాంకేతికతలను అంగీకరించడం అవసరమని ఆయన పేర్కొన్నారు. "మన విద్యార్థులు ఒక వెలుగు వెలగాలంటే, వారు ఈ కొత్త సాంకేతికతలను అలవరచుకోవడం ఎంతో అవసరం," అని అన్నారు. భాను పవన్ పరిశ్రమలపై చూపుతున్న ప్రభావం గురించి వివరణాత్మక ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఏ వన్ రంగంలో ఉన్న అవకాశాలను పొందేందుకు విద్యార్థులను ప్రోత్సహించారు. సెమినార్ ముగింపు సందర్భంగా విద్యార్థులు ప్రశ్నలతో చురుకుగా పాల్గొన్నారు. ఏ వన్ రంగంలోని అంశాలు , మార్గాలపై స్పష్టత పొందారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు ప్రేరణను అందించి, వారి భవిష్యత్తు ప్రణాళికలకు దారితీసే విధంగా సఫలమైంది. .ఈ కార్యక్రమంలో కృత్రిమ మేధస్సు డేటా సైన్స్ విభాగాధిపతి డా. రాధ ,కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా. జి. వేణుమాధవ్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ విభాగాధిపతి డా. టి.డి.వి.ఎ.నాయుడు ఇతర అధ్యాపకులు మరియు కంప్యూటర్ సైన్స్ యండ్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనకేషన్ ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ ప్రకాష్ లో ముగిసిన రిమ్ జిమ్ వేడుకలు

విశాలాంధ్ర-పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల నందు గత 5 రోజులుగా నిర్వహిస్తున్న రిమ్ జిమ్-2024 కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల పాయకరావుపేట, తుని, అన్నవరం విద్యార్థులు సుమారు 4500 మందికి 29 రకాల పోటీలు నిర్వహించి అతిథులుగా విచ్చేసిన లీఫైన్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ హోల్ టైం డైరెక్టర్ ఎం.వి. రామకృష్ణ, డెక్కన్ ఫైన్ కెమికల్స్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.బంగారు బాబు, కాకినాడ లెఫ్టినెంట్ 6 వ ఆంధ్రా నావెల్ ఎన్.సి.సి. కమాండింగ్ ఆఫీసర్ సి.డి.ఆర్. అక్షయ్ అరుణ్ వివిధ పోటీల నందు గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎం.వి. రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్ అకాంక్ష నిర్ణయించు కోనట్లయితే భవిష్యత్ అగమ్యగోచరం అవుతుందని, తల్లిదండ్రులు వారి పిల్లలకు ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకొనే వెసులుబాటు కల్పించాలని తెలిపారు. విద్యార్థులు అనవసర విషయాల్లో జోక్యం మాని భవిష్యత్ ఆకాంక్ష కోసం అనునిత్యం శ్రమపడాలని సూచించారు. ఆర్.బంగారు బాబు మాట్లాడుతూ చదువుతో పాటుగా నేర్చుకోవాల్సిన విషయాలు అనేకం ఉన్నాయని, సమాజం, పర్యావరణం ఈ రెండు నేర్పే మంచి విషయాలు జీవితంలో మనల్ని ఎంతో ఎత్తుకు తీసుకు వెళ్తాయని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్ లో మంచి సమాజాన్ని నిర్మించే ఉపాధ్యాయులుగా మారాలని ఆయన సూచించారు. సి.డి.ఆర్. అక్షయ్ అరుణ్ మాట్లాడుతూ పరిపూర్ణమైన ఆరోగ్యం ఆటల ద్వారానే సాధ్యం అవుతుందని, విద్యార్థులు తమ దైనందిన జీవితంలో ఆటలు కూడా ఒక భాగం చేసుకోవాలని తెలిపారు. విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిలోనూ ప్రతిభ దాగి ఉంటుందని దానిని వెలికితీసి వారిని ఉన్నత స్థానానికి తీసుకువెళ్ళడానికి వారికి కావలసిన మనోధైర్యం విజయాలతో వచ్చిన ప్రేరణ ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.వి.వి.ఎస్.మూర్తి, రిమ్ జిమ్ కన్వీనర్ ప్రసూన మౌళి, అకడమిక్ ఇంచార్జిలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారిని దర్శించుకునేందుకు మూడు లాంతర్లు దరి చదురుగుడికి శనివారం రాత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు కె.సురేష్ రెడ్డి దంపతులు, జస్టిస్ ఎన్.జయసూర్య విచ్చేసారు. ఈసందర్భంగా వారిని దేవస్థానం ఇఓ డివివి ప్రసాదరావు , వేదపండితులు, అర్చకులు సాదరపూర్వకంగా ఆహ్వానించారు. అమ్మవారికి పూజలు నిర్వహించుకున్న అనంతరం వారు ఆలయ ప్రాంగణం లో గల వేపచెట్టువద్దగల ప్రతిమలకు, చెట్టుకు నమస్కారాలు చేసారు. ఇటీవలభక్తులు సమర్పించిన ఊయలను స్పర్శించారు. అమ్మవారి దర్శనానంతరం వేదపండితుల ఆశీర్వాదం పొందిన జస్టిస్ సురేష్ రెడ్డి దంపతులను, న్యాయ మూర్తి ఎన్.జయసూర్యను ఇఓ . ప్రసాదరావు ఉచిత రీతిని సత్కరించారు.అమ్మవారిచిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

కళింగ వైశ్య వర్తక సంఘం నూతన అధ్యక్షుడికి సన్మానం

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లి కళింగ వైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో ఈనెల మూడవ తేదీన జరిగిన నూతన పాలకవర్గం ఎన్నికలో అధ్యక్షులుగా పొట్నూరు నరసింహారావు ని బ్యాలెట్ ద్వారా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు..శుక్రవారం నూతన అధ్యక్షులు ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వైశ్య వార్తకు సంఘం అధ్యక్ష ఉపాధ్యక్షులు, కార్యదర్శి ఇతర ఆఫీస్ బేరర్స్ సభ్యులను జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జనసేన పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికకాబడిన కళింగ వైశ్య పాలకవర్గం స్థానిక ఇంచార్జ్ విసినిగిరి శ్రీనివాసరావు ని గౌరవపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా నూతన పాలకవర్గానికి అభినందన తెలియజేస్తూ నూతన పాలకవర్గ అధ్యక్షులు పొట్నూరు నర్సింగరావు గారికి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేస్తూ కూటమి ప్రభుత్వం తరఫున కళింగ వైశ్య సంఘానికి మా యొక్క సహాయ సహకారాలు పూర్తిస్థాయిలో అందజేస్తామని, ప్రతీ ఒక్కరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

చీపురుపల్లి లో శిశువు మృతిపై బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి సిరియస్

సిసి ఫుటేజ్ అందజేయాలని ఆదేశం....

విచారణకు సహకరించని ఆసుపత్రి యాజమాన్యం....

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి పట్టణంలో గల బాబూజీ ఆసుపత్రిలో బయటపడిన శిశువు మరణం సంఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ కేశవరావు శనివారం సాయంత్రం చీపురుపల్లి లో గల బాబుజి ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఆసుపత్రి వార్డులను పరిసరాలను ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు... ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ లేకపోవడంపై అయినా ఆసుపత్రి యాజమాన్యంపై అసహనం వ్యక్తం చేశారు... ఇటీవల జరిగిన సంఘటనపై సీసీ ఫుటేజ్ లను వెంటనే అందజేయాలని ఆయన ఆదేశించారు... శిశువు మృతి పట్ల జరుగుతున్న విచారణకు సహకరించని యాజమాన్యంపై ఆయన మండిపడ్డారు... ఈ సంఘటనకు సంబంధించి ఏ విధమైన సమాచారం కావాల్సిన తమకు సహకరించాలని అయినా ఆసుపత్రి యాజమాన్యాన్ని హెచ్చరించారు... ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన ఆసుపత్రి యాజమాన్యం ఎంత నిర్లక్ష్య ధోరణి గా వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు.

రెండు వాహనాలు డి ఇద్దరు కు గాయాలు

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి పట్టణంలోని ప్రధాన రహదారిలో సంతానలక్ష్మి కోవెల సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. మండలంలోని పతికేయవలస గ్రామానికి చెందిన పి రామారావు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఉప్పర ఆదినారాయణ వ్యక్తి ఎదురెదురుగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు కాగా చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రి సిబ్బంది ప్రథమ చికిత్సలు నిర్వహించి పోలీసులకు సమాచారం అందజేశారు.

39 మంది గర్భిణీలకు ఆరోగ్య తనిఖీలు

వైద్యాధికారిని ఏ ధరణి

విశాలాంధ్ర-వేపాడ : మండల కేంద్రమైన వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 39 మంది గర్భిణీలకు ఆరోగ్య తనిఖీలు చేయడం జరిగిందని వైద్యాధికారిని ఏ.ధరణి తెలిపారు. శనివారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారిణి ఏ.ధరణి ఆధ్వర్యంలో గైనకాలజిస్ట్ ఏస్.ఫణిశ్రీ 39 గర్భిణీస్త్రీలకు తనికీలు నిర్వహించి ఉచితంగా మందులు ఇచ్చి గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు సలహాలు తెలియజేశారు.అలాగే బానాది శ్రీ సత్యసాయిరా భక్తి మండలి వారిచే గర్భిణీలకు ఏర్పాటు చేసిన భోజనం సదుపాయము కల్పించారు.ఈ కార్యక్రమములో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జోరందుకున్న టిడిపి సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: గొంపవీధిలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు చోడిపల్లి రామరాజు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలకి ఒక్కసారి 100 రూపాయలు చెల్లిస్తే సభ్యులకు ఇన్సూరెన్స్ సదుపాయం ఉంటుందని అలాగే ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే మరణించిన వారి కుటుంబానికి ఐదు లక్షలు ఇన్సూరెన్స్ వస్తుందని అన్నారు. గతంలో ఈ మొత్తం 2 లక్షలు ఉండేదని ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఐదు లక్షలుకి పెంచినట్లు ఆయన తెలిపారు. మృతి చెందిన వారికి మట్టి ఖర్చులు నిమిత్తం పదివేల రూపాయలు తెలుగుదేశం పార్టీ భరిస్తుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో. పిన్నింటి శీను, పట్నాల వెంకటేష్ ,టీ .మధు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పునర్ నిర్మాణానికి బాబు, పవన్ కృషి

మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగ దీశ్వర రావు

విశాలాంధ్ర-అనకాపల్లి: రాష్ట్ర పునర్నిర్మాణానికి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎనలేని కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగ దీశ్వరరావు అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడు తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కొద్ది కాలానికే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని చెప్పారు. ప్రధానంగా గత వైసిపి పాలకులు రోడ్లను అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ పాలనలో నిర్వీర్యమైన రోడ్లను బాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అనకాపల్లి జిల్లాకి తొలిదశ పనులకు 9 కోట్లు నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో రూ. 103 కోట్లతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు వేస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఉచిత గ్యాస్ పథకం కింద 3 లక్షల మంది లబ్ధి పొందుతున్నారని చెప్పారు. అనకాపల్లి జిల్లాలో పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రతి నియోజకవర్గంలో ఒక పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసం ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. గత వైసిపి పాలనలో రాష్ట్ర 30 సంవత్సరాలువెనక్కి వెళ్ళిపోతే, చంద్రబాబు పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. వైసీపీ నాయకులు ప్రభుత్వం పై విమర్శలు చేయడం మానుకోకపోతే, భవిష్యత్తులో రాజకీయంగా ఆ పార్టీ నాయకులకు పుట్టగతులు ఉండవని బుద్ధ నాగ జగదీశ్వరరావు అన్నారు.